క్లుప్తంగా

నియామకం


పూర్ణచందర్

పెద్దవంగర : కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన ముత్యాల పూర్ణచందర్ నియామకం అయ్యారు. కాగా డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్‌రెడ్డి బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణచందర్ మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారని చెప్పారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ నాయకకులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో ఆరోగ్యం



తొర్రూరు : క్రీడలతో ఆరోగ్యం సాధ్యమని విద్యుత్‌శాఖ డీఈ మధుసూదన్ అన్నారు. తొర్రూరు ఎంప్లాయీస్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ టోర్నీ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈ మాట్లాడుతూ.. జీవితంలో ఆటలు భాగమని, వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ క్రీడల్లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గొడిశాల నగేష్, ప్రతినిధులు శంకర్, ఫణీంద్ర, రాయిపల్లి యాకయ్య, ఊడుగుల మధుకర్, చెడుపాక ఐలయ్య, గండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ సేవలు చిరస్మరణీయం



మహబూబాబాద్ అర్బన్ : యూటీఎఫ్ అగ్ర నాయకుడు, అమరజీవి నాగటి నారాయణ సేవలు చిరస్మరణీయమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నారాయణ ప్రథమ వర్ధంతి సభను మురళీకృష్ణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. యూటీఎఫ్ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, జేఏసీ చైర్మన్‌గా సుదీర్ఘకాలం పాటు పని చేశారని అన్నారు. సమావేశంలో షేక్ యాకూబ్, హుస్సేన్, వెంకటేశ్వర్లు, సంజీవ, శ్రీనివాస్, హరి నాయక్, సురేష్, కృష్ణమూర్తి, రాంజీ, బాబు, రవీందర్, వీరభద్రం, తిరుపతి, రమేశ్ పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు



చిన్నగూడూరు : మండలంలోని ఆయా పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సమర్థ విద్యానికేతన్ ప్రైమరీ పాఠశాలలో చిన్నారులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

నివాళి

డోర్నకల్ : అనారోగ్యంతో మంగళవారం మృతి చెందిన బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటమనోహర్ అంత్యక్రియలు బుధవారం డోర్నకల్‌లో నిర్వహించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధర్మారపు వెంకన్న, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు, మండల అధ్యక్షుడు బాసాని నాగేశ్వర్‌రావు, పట్టణ అధ్యక్షుడు దేవా తదితరులు నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు.

మానవత్వం చాటిన ఎస్సై



మహబూబాబాద్ రూరల్ : బయ్యారం ఎస్సై ఉపేందర్ బుధవారం విధి నిర్వహణలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చారు. తిరిగి బయ్యారం బయలుదేరగా అశోక దాబా సమీపంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై ఓ గుర్తు తెలియని వ్యక్తి వస్తూ ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి ఆ వాహనంపై నుంచి కిందపడగా గాయాలయ్యాయి. గమనించిన ఎస్సై వెంటనే సదరు వ్యక్తిని కానిస్టేబుల్ రమేశ్ సహాయంతో ఆటోలో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు.

ఎన్నికలకు సహకరించాలి

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
- ఎమ్మెల్సీని కలిసిన ఎమ్మెల్యే దంపతులు


ఎమ్మెల్సీ రవీందర్‌ను కలిసి సహకరించాలని కోరుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్ : ఎన్నికల్లో అందరి సహకారం అవసరమని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే దంపతులు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. ఎక్కువ సమయం నియోజకవర్గంలోనే ఉండి తన ఎన్నికలకు సహకరించాలని రవీందర్‌రావును కోరారు. పార్టీ కోసం కష్టపడి పని చేస్తానని ఎక్కువ సమమం మానుకోటలోనే ఉండి ప్రచారం చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, మార్నెని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేయాలి

కేసముద్రం : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ కుమారుడు సూర్యచంద్ర అన్నారు. బుధవారం మండలంలోని కల్వలలో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కష్టపడి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, నీలం దుర్గేష్, ఎండి.నజీర్‌అహ్మద్, కముటం శ్రీనివాస్, లింగాల పిచ్చయ్య, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన పెంతల రామయ్య బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా రామయ్య మృతదేహంపై ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ దార్ల రామ్మూర్తి, కేసముద్రం పీఏసీఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు బేతమళ్ల చంద్రయ్య, పింగిలి శ్రీనివాస్, గండు నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఏబీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న కుర్ర మహేష్ తదితరులు

మహబూబాబాద్ రూరల్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ఏబీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కుర్ర మహేష్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చట్టాన్ని నీరుగార్చి కోట్లాది మందిని పనికి దూరం చేసి పేదల నోట్లో మట్టి కొట్టే నూతన ఏబీపీఎస్ విధానాన్ని తీసుకువచ్చిందని తెలిపారు.కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి చేపూరి గణేష్, పట్టణ అధ్యక్షుడు తేలూరి వీరభద్రం, వెలిశాల సుధాకర్, స్పందన, ఉప్పలయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



కేసముద్రం : అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని మండలంలోని నర్సింహులగూడెం ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలను సన్మానించారు. హెచ్‌ఎం కొడిపాక రమేష్ మాట్లాడుతూ.. అక్టోబర్ 11వ తేదీని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలికల దినోత్సవంగా ప్రకటించిందన్నారు. సమాజంలో ఆడపిల్లని చదవనిద్దాం-ఎదగనిద్దామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న రఘుబాబు

గార్ల : బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రఘుబాబు అన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సంస్థ కమ్యూనిటీ మొబిలైజర్ రమేష్, షేర్ ఎన్జీఓ కౌన్సిలర్ సుమలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళాకారులది కీలక పాత్ర


మాట్లాడుతున్న సదానంద్

డోర్నకల్ : తెలంగాణ రాష్ట్ర సాధనలో కళాకారులు కీలకపాత్ర పోషించారని ప్రజా నాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి వేముల సదానంద్ కోరారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజానాట్య మండలి నాల్గోవ మహాసభలో సదానంద్ మాట్లాడారు. అమర వీరుల త్యాగాలతో నిర్మితమైన తెలంగాణలో కుటుంబ పాలన సాగిస్తున్నారని అన్నారు. పాలక వర్గాల అవినీతిని కళల ద్వారా ప్రజలకు తెలియజేయడంలో కళాకారులు ముందుండాలని, ప్రజలను చైతన్యవంతులను చేయడమే ప్రజా నాట్యమండలి కళాకారుల లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో నక్క సైదులు, తాళ్లపల్లి భాగ్యలక్ష్మి, యు.శ్రీనివాస్, కొలిపాక పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఏకపక్ష వైఖరి సరికాదు

బయ్యారం : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి హోదాలో ముసలయ్య ఏకపక్ష వైఖరిని అవలంభించడం సరికాదని ఆ పార్టీ అనుబంధ విభాగం గిరిజన జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ రాము నాయక్, ఎంపీటీసీ మోహన్‌జీ తెలిపారు. బుధవారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రామచంద్రాపురం గ్రామ అధ్యక్షుడు మోహన్‌రావును మార్చి మరొకరికి పదవి ఇస్తున్నట్టు మండల అధ్యక్షుడు ప్రకటించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో జగత్‌రావుపేట, ఇర్సులాపురం సర్పంచ్‌లు భాస్కర్, రామకృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షేక్ ఫక్రుద్దీన్‌కు ద్వితీయ బహుమతి



మరిపెడ : కేరళలోని అలెప్పిలో నిర్వహించిన స్పాట్ కాంపిటేషన్‌లో స్థానిక ఫొటోగ్రాఫర్ షేక్ ఫక్రుద్దీన్ ద్వితీయ బహుమతి అందుకున్నాడు. కేరళలో ఇటీవల నిర్వహించిన 6వ జాతీయ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లో వివిధ రాష్ట్రాల నుంచి 35మంది ఫొటోగ్రాఫర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో మొయినొద్దీన్, శ్రీనివాస్, ఎలుగోటి వెంకట్, తూర్పాటి సత్యనారాయణ, ఇరుకుల్ల వీరేశం, సూర్యప్రకాష్, కొమ్మూరి శ్రీనివాస్, శ్రావణ్, శ్రీహరి, పవన్, కళ్యాణ్, అశోక్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కళాకారులకు గుర్తింపు



మరిపెడ రూరల్ : తెలంగాణ రాష్ట్రంలో కళాకారులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇచ్చిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ అన్నారు. మండలంలోని బీచ్‌రాజ్‌పల్లిలో నవీన్-మంజుల దంపతులను మరిపెడ మున్సిపాలిటీకి చెందిన కోలాట మహిళ కళాకారులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ దంపతులను మహిళా కళాకారులు అభినందించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



బయ్యారం : బయ్యారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సంకు సత్తిరెడ్డి బుధవారం ఇల్లందులో ఎమ్మెల్యే హరిప్రియ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సత్తిరెడ్డి బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధిగా పాత పదవిలోనే కొనసాగిస్తామన్నారు. భద్రాద్రి గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు ..



తొర్రూరు : మున్సిపల్‌కు చెందిన 8వ వార్డు కౌన్సిలర్ నరుకుటి గజానంద్ కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం హనుమకొండలో ములుగు ఎమ్మెల్యే సీతక్క, నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కాగా ఆయన గతంలో కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలవగా రాజకీయ కారణాలతో బీఆర్‌ఎస్‌లో చేరారు. తిరిగి ఆయన సొంత గూటికి చేరుకున్నారు. అమ్మాపురం ఎంపీటీసీ ముద్దం విక్రమ్‌రెడ్డి, యాదవ సంఘాల నాయకులు సైతం కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ టికెట్ భూపాల్ నాయక్‌కు ఇవ్వాలి'

కురవి : డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ కిసాన్ పరివార్ అధినేత నునావత్ భూపాల్ నాయక్‌కు ఇవ్వాలని మండల ఇన్‌చార్జ్‌లు గుగులోత్ భీమా నాయక్, బానోత్ విష్ణు నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తట్టుపల్లి శివారు చంద్యా తండాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డోర్నకల్‌లో కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే భూపాల్ నాయక్ సరైన అభ్యర్థి అన్నారు. సమావేశంలో మంగీలాల్ నాయక్, సోమాజీ, వాంకుడోత్ మంగీలాల్, భగత్ సింగ్ నాయక్, అబ్దుల్, రమేష్, తరుణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

చండీయాగం

డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకు రావాలని ఆ పార్టీ బాధ్యుడు, టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్ మాలోత్ నెహ్రూనాయక్-జీవిత దంపతులు బుధవారం వారి ఇంట్లో చండీయాగం నిర్వహించారు. డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం నెహ్రూనాయక్ దరఖాస్తు చేశారు.

కరపత్రాల ఆవిష్కరణ

మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలోని కిసాన్ పరివార్ అధినేత భూపాల్ నాయక్ కార్యాలయంలో భవిష్యత్‌కు భరోసా కరపత్రాలను బుధవారం ఆతడి అనుచరులు ఏడెల్లి వెంకన్న, కారంపూడి వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ అధికారం లేకున్న స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటు సేవ చేసే నాయకుడు భూపాల్ అని అన్నారు. అఖిల్, నిరంజన్, వెంకన్న, మంగీలాల్, విజయ్‌తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి


డోర్నకల్: చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న సిబ్బంది


నెల్లికుదురు: కారును తనిఖీ చేస్తున్న పోలీసులు


దంతాలపల్లి: బాటిళ్లను చూపుతున్న పోలీసులు

నెల్లికుదురు : అసెంబ్లీ ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి సహకరించాలని ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు. మండల కేంద్రంలోని క్రాస్ రోడ్‌లో మహబూబాబాద్, తొర్రూర్, కేసముద్రం వెళ్లే కూడలి వద్ద బుధవారం వాహనాలను తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వాహనాల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

డోర్నకల్ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు డోర్నకల్, ఖమ్మం రోడ్డు మార్గంలో చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన ఇద్దరు, ఇరిగేషన్ శాఖకు చెందిన ఓ ఏఈతో పాటు ఆరుగురు పోలీస్ సిబ్బంది మూడు షిఫ్టులు విధులు నిర్వహిస్తున్నారు. రెండు జిల్లాల సరిహద్దు మీదుగా వచ్చి పోయే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు.

అక్రమ మద్యానికి అడ్డుకట్ట


దంతాలపల్లి : మండలంలోని వేములపల్లి ఎక్స్ రోడ్డు చెక్ పోస్టు వద్ద పోలీసులు, చెక్‌పోస్ట్ అధికారులు బుధవారం తనిఖీ చేపట్టారు. కాగా నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామానికి చెందిన జాల పద్మ సూర్యాపేట నుంచి దంతాలపల్లి వైపు వస్తున్న క్రమంలో చెక్ పోస్ట్ వద్ద తనిఖీ చేశారు. ఆమె వద్ద నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.18 వేలు విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమేశ్ బాబు, పోలీసులు తెలిపారు. చెక్‌పోస్ట్ స్పెషల్ ఆఫీసర్ అనిల్(ఏఈ, ఇరిగేషన్) ఫిర్యాదు మేరకు ఆమెపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది, చెక్‌పోస్ట్ స్పెషల్ సిబ్బంది పాల్గొన్నారు.

'కోడ్' అమల్లో ఉన్నా..



బయ్యారం : ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వైన్స్‌ల నుంచి బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తుండడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. నిబంధనల ప్రకారం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో బెల్ట్ షాపులకు వాహనాల ద్వారా మద్యం సరఫరా చేయకూడదు. దీంతో పాటు బెల్ట్‌షాపులను సైతం నిర్వహించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. అయితే మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు యథావిధిగా కొనసాగుతూ మద్యం రవాణా నిర్వహిస్తుండడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సంఘాల పరిశీలనకు తరలిన రైతులు



మరిపెడ : రైతు ఉత్పత్తిదారుల సంఘాలను పరిశీలించేందుకు మరిపెడ, తొర్రూర్ మండలాల నుంచి స్థానిక రైతులు బుధవారం తరలి వెళ్లినట్లు స్పందన సర్వీసెస్ సొసైటీ ప్రతినిధి ఎడెల్లి పరశురాములు తెలిపారు. నాబార్డు సహకారంతో ఆయా ఉత్పత్తిదారుల సంఘాల డైరెక్టర్లు, సభ్యులు ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా ముల్కనూరు, అంకాపూర్, ఇంద్రవెల్లి రైతు ఉత్పత్తి దారుల సంఘాలను తిలకించుందుకు బస్సులో తరలి వెళ్లారు. నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, చొప్పరి సోమయ్యలు జెండా ఊపి బస్సును ప్రారంభించారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కురవి : రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు మండలంలోని రాజోలు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎ.రవికుమార్, పీఈటీ దార్ల సునీల్ బుధవారం తెలిపారు. ఈనెల 4వ తేదీన మానుకోటలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన అండర్-17 బాలబాలికల పోటీలో అత్యంత ప్రతిభ కనబరిచిన డి.హైమావతి, డి.మమత, బి.శైలు, డి.చందు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు తొర్రూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, వీరభద్రం, దురేష్, వీరన్న, రాజేశ్వరీ, బీకు, సురేష్, ప్రభాకర్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని బలపాల జెడ్పీఎస్ఎస్ విద్యార్థులు మధుక్రాంతి, సందీప్, శశి, వర్షిత్ ఎంపికైనట్లు హెచ్‌ఎం నర్సింహారెడ్డి, పీఈటీ రవికుమార్ తెలిపారు. ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీనివాస్, కన్నయ్య అభినందించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బయ్యారం : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని మిర్యాలపెంట ఎంపీటీసీ సనప సోమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని ఇసుకమేదిలో గడప గడపకు కాంగ్రెస్‌లో భాగంగా ప్రజలను కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణ, నాయకులు స్వామి, భద్రమ్మ, రాధ, వరయ్య, రమేశ్, పద్మారావు, సంపత్, సాంబశివరావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం


తొర్రూరులో మాట్లాడుతున్న కర్ర శ్రీనివాస్‌రెడ్డి

తొర్రూరు : బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కుటుంబ పాలనకు చరమగీతం పాడేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మంత్రి దయాకర్ రావుకు ఓటమి తప్పదని, అతడి తీరుపై నియోజకవర్గ ప్రజలు విసిగిపోయారన్నారు. పాలకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, కౌన్సిలర్ కొలుపుల శంకర్, యాకయ్య, ఉపేందర్, రవి, నవీన్, శివ, సంతోష్, భాస్కరాచారి, విష్ణు పాల్గొన్నారు.

బీజేపీతోనే యువత జీవితాల్లో మార్పు

తొర్రూరు రూరల్ : బీజేపీతోనే యువత జీవితాల్లో మార్పు సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు, రాష్ట్ర నాయకుడు లేగా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. రూరల్ మండల అధ్యక్షుడు బి.సురేష్ ఆధ్వర్యంలో మండలంలోని జీకే తండాకు చెందిన యువకులు బుధవారం బీజేపీలో చేరారు. నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్, జిల్లా కార్యదర్శి రచ్చ కుమార్, నాయకులు రవిబాబు, చింతా సృజన్, సుధాకర్, నవీన్‌రెడ్డి, కొండ యాకన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనాన్ని భరించలేక..

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య


పూల్‌సింగ్ (ఫైల్)

కేసముద్రం : ఒంటరితనాన్ని భరించలేక జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఇంటికన్నె రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం జరిగింది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నెక్కొండ మండల శివారు కస్నాతండాకు చెందిన బోడ పూల్‌సింగ్ (50)కు వివాహం కాగా కొద్దిరోజులకే భార్య వెళ్లిపోయింది. ఆ తర్వాత తన అన్న కుమారుడైన చంద్రు వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఒంటరి జీవితాన్ని భరించలేక తీవ్ర మనస్తాపానికి గురైన అతడు ఇంటికన్నె-కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య 418/23-21 కిలోమీటర్ రైల్వే ట్రాక్ వద్ద అప్‌లైన్‌లో వెళ్తున్న రైలు కింద పడటంతో, తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరిపెడ: లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. నర్సింహులపేట మండలం పెద్దనాగారం గ్రామానికి చెందిన ఉమేష్, సురాంభలు ద్విచక్ర వాహనంపై మరిపెడ నుంచి పెద్దనాగారం వెళ్తుండగా తొర్రూర్ నుంచి ఖమ్మం వైపు వెళుతున్న లారీ మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా ఆలయం సమీపంలో ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, మెరుగైన వైద్యం ఉమేష్(40)ను వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు సమాచారం.